క్లుప్తంగా

వారపు సంతలో భోజనం వితరణ



భోజనాలు వడ్డిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పాకాల : స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని వారపు సంతలో సోమవారం చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సొంత నిధులతో రైతులు, వ్యాపారులకు భోజనం వితరణ చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు మాట్లాడుతూ సంతకు వచ్చే రైతులు, వ్యాపారులు భోజనం కోసం ఎదురు చూసే పరిస్థితి ఉండకూడదని ఎమ్మెల్యే ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. తమ ఆకలి తీరుస్తున్న ఎమ్మెల్యే కుటుంబానికి రుణపడి ఉంటామని పలువురు రైతులు, వ్యాపారులు తెలిపారు.

యువకుడిపై కత్తులతో దాడి

తిరుమల : తిరుమలలో సోమవారం యువకుడిపై ముగ్గురు కత్తులతో దాడి చేశారు. శ్రీవారి ఆలయం ముందున్న షాపింగ్ కాంప్లెక్స్ వద్దనున్న ఫాస్ట్ ఫుడ్ హోటళ్లలోకి భక్తులను పిలిచే వ్యవహారమే ఘటనకు కారణం. డ్రైవర్ పద్మనాభం, సతీష్ రెడ్డి భక్తులను తమ హోటల్‌లోకి పిలిచే క్రమంలో వాగ్వాదానికి దిగారు. మాటామాటా పెరిగింది. కోపంతో రగిలిపోయిన సతీష్ రెడ్డి మరో ఇద్దరి స్నేహితులతో కలిసి కొంత సమయానికి అక్కడికి చేరుకున్నాడు. పద్మనాభంపై కత్తులతో దాడి చేశారు. అతను రోడ్డుపై పరుగు పెట్టినా వెంటాడి దాడి చేశారు. కొంతమంది స్థానికులు, భక్తులు వారి వద్దకు వెళ్లే ప్రయత్నం చేయగా ముగ్గురు అక్కడి నుంచి వెళ్లిపోయారు. తీవ్రంగా గాయపడిన పద్మనాభంను స్థానిక అశ్విని ఆస్పత్రికి తరలించి వైద్యం అందించారు. టూటౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల:శ్రీవారిని సోమవారం ఎమ్మెల్యే పొన్నాడ వెంకటసతీష్‌కుమార్, తెలంగాణ ఎమ్మెల్యే భానుశంకర్ నాయక్ దర్శించుకున్నారు. వీరికి అధికారులు దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం అందించగా అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

బస్టాండ్‌లో జోరుగా సర్వే

తిరుపతి అర్బన్: తిరుపతి సెంట్రల్ బస్టాండ్‌లో అధికారులు జోరుగా సర్వే చేస్తున్నారు. త్వరలో ఫ్లై ఓవర్ బ్రిడ్జి నుంచి నేరుగా తిరుపతి బస్టాండ్‌లోకి ఆర్టీసీ సర్వీసులు చేరుకోనున్నాయి. రామానుజ సర్కిల్ వద్ద ఫ్లై ఓవర్ పనులు పూర్తయిన వెంటనే బస్టాండ్‌లోకి బస్సులు వచ్చేలా చర్యలు చేపట్టనున్నారు. ఈ నేపథ్యంలో సర్వీసులకు అడ్డుగా పడమర వైపు ఉన్న 10 దుకాణాలను తొలగించడానికి ఆర్టీసీ ఇంజినీరింగ్ అధికారులు సర్వే చేపట్టారు.

మోహిత్‌రెడ్డి మహా పాదయాత్రలో మార్పు

భాకరాపేట: వైఎస్సార్ సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి చేపట్టిన గడప గడపకూ మహా పాదయాత్రలో స్వల్ప మార్పులు చేసినట్లు చిన్నగొట్టిగల్లు ఎంపీపీ యుగంధర్‌రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ సహదేవరెడ్డి తెలిపారు. బుధవారం ఎగవూరు, దిగవూరు పంచాయతీలు, 4న రంగన్నగారిగడ్డ, కొటబైలు పంచాయతీలు, 5న నెల్లుట్లవారిపల్లె, 6న టీ.చట్టేవారిపాళెం, 7న తిప్పిరెడ్డిగారిపల్లె, 8న జంగావాండ్లపల్లె, 9, 10 తేదీల్లో చిన్నగొట్టిగల్లు పంచాయతీలో మహా పాదయాత్ర కొనసాగుతుందన్నారు.

రుయా కార్మికులకు హైజీన్ కిట్ల పంపిణీ



కార్మికులకు కిట్లను పంపిణీ చేస్తున్న దృశ్యం

తిరుపతి తుడా: ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో తిరుపతి రుయా పారిశుద్ధ్య కార్మికులకు హైజీన్ కిట్లను పంపిణీ చేశారు. రుయాలో సోమవారం కార్మిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రుయా సీఎస్ ఆర్ఎంవో లక్ష్మానాయక్, ఏఆర్ఎంవో యువ అన్వేష్ రెడ్డి కిట్లు అందజేశారు. రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ వి.ప్రసాద్ మాట్లాడుతూ కార్మిక దినోత్సవం సందర్భంగా కార్మికులకు కిట్లు పంపిణీ చేశామని చెప్పారు. రెడ్ క్రాస్ సభ్యులు జీ.సుదర్శన రావు తదితరులు పాల్గొన్నారు.

జాతరలోపే మాస్టర్ ప్లాన్ రోడ్డు పూర్తి

తిరుపతి తుడా : గంగమ్మ గుడి మాస్టర్ ప్లాన్ రోడ్డును జాతరలోపే పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొస్తామని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరిత తెలిపారు. ఆమె సోమవారం రోడ్డు పనులను పరిశీలించారు. ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, మేయర్ శిరీష, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి నిత్యం పనులను పర్యవేక్షిస్తూ ప్రోత్సహిస్తున్నారని, స్థానికుల సహకారంతోనే పనులు సకాలంలో చేపట్టామన్నారు. కార్యక్రమంలో ఎస్ఈ మోహన్, ఎంఈ చంద్రశేఖర్, డీఈ దేవిక, ఏసీపీ బాలసుబ్రమణ్యంలు పాల్గొన్నారు.

ఘనంగా వాసవీ జయంతి

చంద్రగిరి(తిరుపతి రూరల్): చంద్రగిరి పాతపేటలోని వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో సోమవారం వాసవీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ చేగు.లక్ష్మీనారాయణగుప్త, వైఎస్సార్ సీపీ వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు చేగు ప్రశాంత్‌గుప్త ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. చేగు గోవర్ధన్, పృథ్వీరాజ్, నాగరాజరెడ్డి, వినోద్‌రెడ్డి, మస్తాన్ పాల్గొన్నారు.

ఘనంగా మేడే సంబరాలు



కార్మికులకు దుస్తులు అందజేస్తున్న పీసీ.రాయలు



కేక్ కట్ చేస్తున్న సర్పంచ్ రామచంద్రారెడ్డి



కార్మికులకు నగదు ఇస్తున్న సర్పంచ్ రూప

తిరుపతి కల్చరల్: తిరుపతి నగరంలో సోమవారం వివిధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మే డే సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. కార్మికులు ఎర్రజెండాలు చేతపట్టి ర్యాలీ చేశారు. ఆయా కార్యాలయాలు, కూడళ్ల వద్ద కేక్‌లు కట్ చేసి జెండాలు ఆవిష్కరించారు.

కార్మికులకు దుస్తుల పంపిణీ

మేడే సందర్భంగా డాక్టర్ వైఎస్ఆర్ ప్రజాప్రస్థానం సేవా ట్రస్ట్, కస్తూర్బా గాంధీ కేంద్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ చైర్మన్ పీసీ.రాయులు 200 మంది ఈఎస్ఐ కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈఎస్ఐ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్, డాక్టర్లు రెడ్డెప్ప, ఏపీఎస్.ప్రసాద్, వైఎస్ఆర్ ప్రజాప్రస్థానం సేవా ట్రస్ట్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ ఆధ్వర్యంలో..

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరులో 11 కేంద్రాల్లో మేడే జెండాలను ఎగురవేసి సంబరాలు జరుపుకున్నారు. పోలీస్ స్టేషన్ సమీపంలోని శ్రీ పద్మావతి ఆటో వెల్ఫేర్ అసోసియేషన్ ఆటో కార్మికుల స్టాండ్ వద్ద తిరుచానూరు సర్పంచ్ రామచంద్రారెడ్డి ఏఐటీయూసీ జెండాను ఆవిష్కరించారు. కేకు కట్ చేసి పంచిపెట్టారు. అనంతరం కార్మికులకు అన్నదానం చేశారు. ముండ్లపూడి, పాడిపేటలో జెండాలు ఆవిష్కరించి, ర్యాలీ చేపట్టారు.

కార్మిక చట్టాలను అమలు చేయాలి

పాకాల : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక చట్టాలను అమలు చేయాలని ఏఐటీయుసీ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌కు సమీపంలోని ఏఐటీయూసీ అమ్మ ఆటో స్టాండ్ వద్ద ఏఐటీయుసీ ఉపాధ్యక్షుడు ఎం.ప్రకాష్ కార్మిక జెండాను ఆవిష్కరించారు.

ఆశావర్కర్ల ర్యాలీ

చంద్రగిరి(తిరుపతి రూరల్): కార్మిక దినోత్సవం సందర్భంగా సోమవారం చంద్రగిరిలో ఆశా వర్కర్లు ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ర్యాలీ చేశారు.

చంద్రగిరిలో..

చంద్రగిరి(తిరుపతి రూరల్): చంద్రగిరి మండలంలో కార్మిక దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. చంద్రగిరి పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ రూప జెండా ఎగురవేశారు. కేక్ పంచి పెట్టారు. కార్మికులకు రూ.30 వేలు అందజేశారు.

జగనన్న పాలనలోనే కార్మికుల సంక్షేమం



మాట్లాడుతున్న కేతం జయచంద్రారెడ్డి

తిరుపతి మంగళం : ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి పాలనలో కార్మికులు సంక్షేమ ఫలాలతో సంతోషంగా జీవిస్తున్నారని తిరుపతి టౌన్ బ్యాంకు చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి తెలిపారు. తిరుపతి ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఆటో కార్మికులు నిర్వహించిన మే డేలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ తిరుపతి ఆర్టీసీ బస్టాండ్ వద్ద మహిళా ఆటో స్టాండ్ ఏర్పాటు చేయించిన ఘనత ఎమ్మెల్యే కరుణాకరరెడ్డికి దక్కుతుందన్నారు.

ఘనంగా చదలవాడ కృష్ణమూర్తి జన్మదిన వేడుకలు



చదలవాడకు కేక్ తినిపిస్తున్న కుమార్తె

తిరుపతి కల్చరల్: మాజీ ఎమ్మెల్యే, చదలవాడ విద్యాసంస్థల అధినేత చదలవాడ కృష్ణమూర్తి జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆయనకు అనుచరులు, అభిమానులు, శ్రేయోభిలాషులు శుభాకాంక్షలు తెలిపారు. ప్రతాప్ గ్రూప్ థియేటర్ వద్ద సిబ్బంది భారీ కేక్ కట్ చేసి పంచిపెట్టారు. చదలవాడ విద్యాసంస్థల్లోనూ వేడుకలు జరుపుకున్నారు. రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో రంగస్థలి ప్రతినిధులు సుబ్రమణ్యంరెడ్డి, నవీన్, ధనకుమార్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి చదలవాడను సత్కరించారు. కాపు సంక్షేమ సేన రాష్ట్ర అధ్యక్షుడు ఆర్కాట్ కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో గ్రూప్ థియేటర్‌లో చదలవాడ కృష్ణమూర్తిని శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కాపు సంక్షేమ సేన నేతలు శ్రీరామ్ గోపి, మహేష్, ఎర్రశెట్టి సుబ్రమణ్యం పాల్గొన్నారు.

ఇద్దరు దొంగలకు జైలు

తిరుపతి లీగల్ : తిరుమలలో భక్తుల జేబుల నుంచి సొమ్మును అపహరించిన కేసులో ఇద్దరికి 3 నెలల జైలు శిక్ష, రూ.100 చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి పల్లపోలు కోటేశ్వరరావు సోమవారం తీర్పు చెప్పారు. తమిళనాడుకు చెందిన పీసీ రమేష్‌కుమార్, తిరుపతి జబ్బార్ లేఅవుట్‌కు చెందిన ఆర్.రాజకుమార్ చోరీకి పాల్పడగా తిరుమల వన్‌టౌన్ పోలీసులు వారిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు.

పేదల సొంత ఇంటి కల సాకారానికి కృషి

తిరుపతి కల్చరల్: రాష్ట్రంలోని పేదలకు సొంత ఇంటి కల సాకారానికి మెప్మా సిబ్బంది కృషి చేయాల్సి ఉందని ఏపీ మెప్మా మిషన్ డైరెక్టర్ వి.విజయలక్ష్మి తెలిపారు. రాస్ కార్యాలయంలో సోమవారం జరిగిన తిరుపతి జిల్లా మెప్మా సిబ్బంది సమీక్షా సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ అర్హులందరికీ ఇళ్ల నిర్మాణానికి రుణాలు ఇప్పించాలన్నారు. మహిళలకు ఆర్థికంగా శక్తిమంతులను చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. వైఎస్ఆర్ ఆసరా, చేయూత వంటి అన్ని అంశాలపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో పథక సంచాలకులు రాధమ్మ, రాష్ట్ర స్థాయి అధికారులు రమేష్, ఏఎంబీ ఆదినారాయణ, ఎస్ఎస్ఆర్ శ్రీనివాసులు, రంగాచారి పాల్గొన్నారు.

శివాలయాల్లో ప్రత్యేక పూజలు

భాకరాపేట : చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాళెం మండలాల్లోని శివాలయాల్లో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. తలకోన సిద్ధేశ్వరస్వామికి అభిషేకం, అర్చనలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. చిన్నగొట్టిగల్లులోని భీమేశ్వర స్వామి, బండకొండ సిద్ధేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి.

కార్మిక సంక్షేమానికి పెద్దపీట

తిరుపతి రూరల్: కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వాలు అమలుచేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కార్మికశాఖ సంయుక్త కమిషనర్ బాలునాయక్ తెలిపారు. మేడే సందర్భంగా సోమవారం రాస్ కార్యాలయంలో పథకాలపై అవగాహన కల్పించారు. రాస్ నాగరాజు, సహాయ కార్మిక కమిషనర్ చిన్నలాలప్ప, ఏఎల్‌ఓ రాజయ్య, కార్మికులు పాల్గొన్నారు.

స్టేషన్‌కు చేరిన మేక



ఎంఆర్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో బైక్, మేక

తిరుపతి రూరల్: మండలంలో దొంగలు రెచ్చిపోతున్నారు. ఇటీవల పుదిపట్ల, పేరూరు, పాతకాల్వ, చెర్లోపల్లి పంచాయతీల్లో రాత్రుళ్లు మేకలు, గొర్రెలను ఎత్తుకెళ్తున్నారు. ఆదివారం అర్ధరాత్రి పుదిపట్ల పంచాయతీలో బడి వెంకటేష్‌యాదవ్‌కు చెందిన రూ.18 వేల విలువైన మేకను ఇద్దరు దొంగలు నెంబర్ ప్లేటులేని బైక్‌పై వచ్చి ఎత్తుకెళ్లారు. పుదిపట్ల నుంచి పేరూరు మీదుగా పూతలపట్టు–నాయుడుపేట జాతీయరహదారిపై వెళ్లేందుకు ప్రయత్నించారు. బీటు నిర్వహిస్తున్న ఎంఆర్‌పల్లి పోలీసులకు కంటపడ్డారు. మేకను, బైక్‌ను వదిలి పారిపోయారు. వాటిని పోలీసులు ఎంఆర్‌పల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సోమవారం ఉదయం మేక గురించి తెలుసుకున్న యాజమాని బడి వెంకటేష్‌యాదవ్ స్టేషన్‌కు చేరుకుని మేకను గుర్తించారు. పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బాధ్యతలు చేపట్టిన జడ్జిలు



విజయ్‌సారథిరాజు, సునీతరాణి

తిరుపతి లీగల్ : తిరుపతి ప్రిన్సిపల్ సీనియర్, అదనపు సీనియర్ సివిల్ జడ్జిలు డి.విజయసారథిరాజు, ఎ.సునీత రాణి సోమవారం బాధ్యతలు చేపట్టారు. జడ్జి విజయ సారథిరాజు గుంటూరు 1వ అదనపు సీనియర్ సివిల్ జడ్జిగా పని చేస్తూ బదిలీ అయ్యారు. అలాగే జడ్జి ఎ.సునీతరాణి గుంటూరు 5వ అదనపు సీనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తూ ఇక్కడికి వచ్చారు.

ఆర్ఎంపీ భూకబ్జాలపై చర్యలు తీసుకోండి

చంద్రగిరి(తిరుపతి రూరల్): ఆర్ఎంపీ ముసుగులో ప్రభుత్వ భూములను కబ్జా చేస్తున్న సుధారాణిపై చర్యలు తీసుకోవాలని చంద్రగిరి బజారువీధి ద్రౌపది సమేత ధర్మరాజుల గుడి ధర్మకర్త విరూపాక్షి శంకర్‌రెడ్డి కోరారు. ఆయన సోమవారం స్పందనలో రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. చంద్రగిరి సర్వే నెంబర్ 161లో సుధారాణి భారీగా భూకబ్జాలకు పాల్పడినట్టు తెలిపారు. 12 సెంట్ల కాలువ పొరంబోకును ఆక్రమించి రెండు ఇళ్లు నిర్మించినట్లు చెప్పారు. మహాభారతం నాటకం ప్రదర్శన కోసం కేటాయించిన స్థలాన్ని, సమావేశ మందిరం నిర్మించనున్న భూమిని కబ్జా చేయాలని దౌర్జన్యానికి పాల్పడుతున్నట్లు ఆరోపించారు. స్పందించిన డీటీ ఈశ్వర్‌రెడ్డి విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామన్నారు. స్థానికులు కుప్పిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీ మాధవరెడ్డి, బుల్లెట్ చంద్రమౌళిరెడ్డి, కోటి పాల్గొన్నారు.

ఘనంగా ఆరాధనోత్సవాలు



విశేషాలంకరణలో స్వామి వారు

తిరుపతి కల్చరల్: అన్నారావు సర్కిల్లోని శ్రీవీరబ్రహేంద్రస్వామి ఆలయంలో ఆరాధన ఉత్సవాల సందర్భంగా సోమవారం విశేష పూజలు నిర్వహించారు. రాత్రి స్వామిని ఘనంగా ఊరేగించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే స్పందన



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న మేయర్ శిరీష, కమిషనర్ హరిత

తిరుపతి తుడా: ప్రజా సమస్యల పరిష్కారానికే స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నామని మేయర్ శిరీష తెలిపారుఉ. ఆమె సోమవారం కమిషనర్ హరితతో కలిసి స్పందన, డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాలను నిర్వహించారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. గతవారం వచ్చిన సమస్యలకు పరిష్కారం చూపడంపై అధికారులతో సమీక్షించారు. మేయర్ మాట్లాడుతూ ప్రతి ఫిర్యాదుకు సంబంధిత శాఖ అధికారులు బాధ్యత వహించి పరిష్కరించాలన్నారు. కమిషనర్ హరిత మాట్లాడుతూ స్పందనలో ప్రజల నుంచి వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. డయల్ యువర్ కమిషనర్‌కు 14, స్పందనలలో 17 సమస్యలు అందాయన్నారు. ఈ నెల 9న ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్ రెడ్డి ప్రారంభించనున్న జగనన్నకు చెబుదాం కార్యక్రమంపై ఇప్పటికే తమ అధికారులు, సిబ్బందికి శిక్షణ ఇచ్చామన్నారు. ప్రజలు తమ సమస్యలను 1902 కాల్ సెంటర్ కు తెలిపితే వెంటనే పరిష్కార మార్గం చూపుతామని వెల్లడించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ సునీత, ఉప కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, ఎస్ఈ మోహన్, హెల్త్ ఆఫీసర్ హరికృష్ణ, రెవెన్యూ ఆఫీసర్ కే.ఎల్.వర్మ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా ప్రేమ్‌కుమార్



అభినయ్‌రెడ్డి నుంచి నియామక పత్రాన్ని అందుకుంటున్న ప్రేమ్‌కుమార్

తిరుపతి మంగళం : వైఎస్సార్ ఎస్వీయూ విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా మన్నం ప్రేమ్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు పాలగిరి ప్రతాప్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన సోమవారం పద్మావతిపురంలోని ఎమ్మెల్యే నివాసంలో డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి నుంచి నియామక పత్రం అందుకున్నారు. ఎమ్మెల్యే భూమన, అభినయ్‌రెడ్డికి రుణపడి ఉంటానని, విద్యార్థి విభాగం బలోపేతానికి కృషి చేస్తానని ప్రేమ్‌కుమార్ తెలిపారు.

పశువుల కంటైనర్ సీజ్

చంద్రగిరి(తిరుపతి రూరల్): నెల్లూరు నుంచి తమిళనాడుకు పశువులను అక్రమంగా తరలిస్తున్న కంటైనర్‌ను చంద్రగిరి పోలీసులు సీజ్ చేశారు. చంద్రగిరి మండలం గాదంకి టోల్ ప్లాజా సమీపంలో సోమవారం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. నెల్లూరు నుంచి తమిళనాడు రాష్ట్రంలోని పొల్లాచ్చికి వెళ్తున్న భారీ కంటైనర్‌ను తెరిచి చూశారు. అందులో 34 పశువులను ఇరుకుఇరుకుగా కుక్కినట్టు ఎస్ఐ వంశీకృష్ణ గమనించారు. అనుమతులు, పత్రాలు లేకుండా పశువులను తరలిస్తున్నట్లు గుర్తించి డ్రైవర్‌ని అదుపులోకి తీసుకున్నారు. కంటైనర్‌ను స్టేషన్‌కు తరలించారు. పశువులను తిరుచానూరులోని గోశాలకు తరలించారు.